ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 12 ఏప్రిల్ 2024





ఓటరుగా నమోదు కావాలంటే..

- 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదుకు అర్హులు. ఓటర్ల నమోదు, చేర్పులు, తొలగింపులు, సవరింపులు చేసుకోవచ్చు.
- నిర్ణీత నమూనాలో ఉన్న ఫారాలను ముందుగా నింపాలి.
- **ఫారం 6 :** కొత్త ఓటర్ల జాబితాలో పేరు చేర్పునకు క్లయిమ్ దరఖాస్తు.
- **ఫారం 7 :** ఓటరు జాబితాలో పేరు చేర్పునకు సంబంధించి అభ్యంతరం తెలపడానికి, జాబితాలోంచి పేరు తొలగించడానికి దరఖాస్తు.
- **ఫారం 8 :** ఓటరు జాబితాలో సవరణలు చేయడానికి దరఖాస్తు.
- **ఫారం 8 ఏ :** ఓటరు జాబితాలో పేరును మరో చోటికి బదిలీ చేయడానికి దరఖాస్తు.
- ఈ ఫారములు నింపి సంబంధిత తహసీల్ కార్యాలయంలో లేదా బీఎల్‌వోలకు ఇవ్వాల్సి ఉంటుంది.

పెరిగిన యువ ఓటర్లు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాను ఇప్పటికే పూర్తి చేశారు. అయితే యువకులు, ఓటరు జాబితాల్లో తప్పిపోయిన వారు మరోసారి ఓటరుగా నమోదు కావడానికి ఈ నెల 15 వరకు అవకాశం ఇచ్చారు. ఫిబ్రవరి 8న ప్రకటించిన తుది జాబితాలో 18 ఏళ్లు నిండిన వారు 12,041 మంది పెరిగారు. వీరిలో యువకులు 6520 మంది, యువతులు 5519 మంది ఉన్నారు. వేములవాడ నియోజకవర్గంలో 5856 మంది ఓటర్లు పెరగగా యువకులు 3201 మంది, యువతులు 2653 మంది జెండర్‌లు ఇద్దరు, సిరిసిల్ల నియోజకవర్గంలో 6185 ఓటర్లు పెరగగా యువకులు 3319 మంది, యువతులు 2866 మంది పెరిగారు.

మిగిలింది మూడు రోజులే

- ఓటరు నమోదుకు 15న చివరి తేదీ
- ఫిబ్రవరి 8న విడుదలైన తుది జాబితా
- రెండు సెగ్మెంట్లలో 4.70 లక్షల మంది ఓటర్లు
- పెరిగిన యువ ఓటర్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. షెడ్యూల్ రావడంతో రాజకీయ పార్టీలు ఓట్లు రాబట్టుకునే పనిలో పడ్డాయి. ఇందుకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపికకు సన్నాహక సమావేశాలపై దృష్టి సారించాయి. ఫిబ్రవరి 8న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితాను వెల్లడించినా లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేయడానికి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి మరో అవకాశాన్ని ఇచ్చింది. ఇందుకు ఇక మూడు రోజులే మిగిలి ఉంది. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులకు వీలును కల్పించింది. అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టిసారించింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో పార్టీల నాయకులు కూడాఓటరు నమోదుపై దృష్టి సారించారు. మరోవైపు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో ఎన్నికలకు వడివడిగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు నమోదు కోసం విస్తృత ప్రచారం చేపడుతున్నారు.

రెండు సెగ్మెంట్లలో 4.70 లక్షల ఓటర్లు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో తుది ఓటరు జాబితా ప్రకారం 4 లక్షల 70 వేల 919 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,26,912, మహిళలు 2,43,808, జెండర్ 39 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 160 మంది ఉండగా పురుషులు 153 మంది, స్త్రీలు ఏడుగురు ఉన్నారు. ఇందులో వేములవాడ నియోజకవర్గంలో 2,25,267 ఓటర్లు ఉండగా పురుషులు 1,07,618, మహిళలు 1,17,561, జెండర్ 32 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 56 మంది ఉండగా పురుషులు 53 మంది, స్త్రీలు ముగ్గురు ఉన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 2,45,652 ఓటర్లు ఉండగా పురుషులు 1,19,294, మహిళలు 1,26,247 జెండర్ ఏడుగురు ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 104 మంది ఉండగా పురుషులు 100 మంది, స్త్రీలు నలుగురు ఉన్నారు. జిల్లాలో దివ్యాంగుల ఓటర్లు 11,266 మంది ఉండగా పురుషులు 6324 మంది, మహిళలు 4942 మంది ఉన్నారు. వేములవాడ నియోజకవర్గంలో 5804 మంది ఉండగా, పురుషులు 3152 మంది, మహిళలు 2652 మంది, సిరిసిల్ల నియోజకవర్గంలో 5462 మంది ఉండగా పురుషులు 3172 మంది, మహిళలు 2290 మంది ఉన్నారు.

ఈ-రిజిస్ట్రేషన్ ఇలా..

- ఎన్నికల కమిషన్ సూచించిన అన్ని ఫారముల ను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఈ రిజిస్ట్రేషన్ కోసం అందుబాటులో ఉంచారు.
- అర్హత కలిగిన యువత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వెబ్ సైట్‌లో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పేరుతో ఉన్న వెబ్ సైట్ వస్తుంది. దీంట్లో పైన ఈ-రిజిస్ట్రేషన్ కని పిస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే కొత్తగా చేరే వారి కోసం, చేర్పులు, మార్పులు, అభ్యం తరాలకు సంబంధించిన ఫారములు కనిపిస్తాయి.
- కొత్తగా చేరే వారు ఫాం-6పైన క్లిక్ చేస్తే ఫాం వస్తుంది. అందులో వివరాలను పొంద పర్చాలి.
- వివరాలను పొందపర్చిన తరువాత తెలుగులో ట్రాన్స్‌లేట్ కోసం ఆప్షన్ ఉంటుంది.
- ఫారం పూర్తి చేసిన తరువాత ఫొటోను అప్‌లోడ్ చేయాలి. 100 కేబీలకు మించకుండా 240 గీ 320 ఉండాలి.
- ఫారం 6 నింపడం పూర్తయిన తరువాత సేవ్ చేసి ట్రాన్స్‌ఫర్ బటన్ క్లిక్ చేయాలి. ఆ తరువాత యునిక్యూ అప్లికేషన్ ఐడి నెంబర్ వస్తుంది. ఆ నెంబర్ ద్వారా మీరు అప్‌లోడ్ చేసిన దరఖాస్తు స్టేటస్‌ను చూసుకోవచ్చు.
- ఓటరుగా ఈ రిజిస్ట్రేషన్ చేసిన దరఖాస్తును సంబంధిత తహసీల్దార్, డౌన్‌లోడ్ చేసుకొని సమర్పించిన వివరాలపై విచారణ జరుపుతాడు.



ఓటరు నమోదును పరిశీలిస్తున్న నోడల్ అధికారి దేవసేన(ఫైల్)

సిరిసిల్ల ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
వీర్నపల్లి	5709	5840	11,549
ఎల్లారెడ్డిపేట	19,401	20,848	40,249
గంభీరావుపేట	17,566	18,662	36,228
సిరిసిల్ల	39,366	41,380 (జెండర్ 6)	80,752
తంగళ్లపల్లి	18,708	19,873 (జెండర్ 1)	38,582
ముస్తాబాద్	18,544	19,644	38,188
మొత్తం	1,19,294	1,26,247 (జెండర్ 7)	2,45,548

వేములవాడ ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
మేడిపల్లి	11,224	12,771	23,995
భీమారం	8147	9084 (జెండర్1)	17,232
కథలాపూర్	17,271	19,477	36,748
రుద్రంగి	3919	4518 (జెండర్ 2)	8439
చందుర్తి	13,224	14,403	27,627
వేములవాడ రూరల్	8930	9718	18,648
వేములవాడ	28,090	29,900 (జెండర్ 29)	58,019
కోనరావుపేట	16,813	17690	34,503
మొత్తం	1,07,618	1,17,561 (జెండర్ 32)	25,5211

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక పార్థనల్లో ముస్లింలు

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్షలు ముగించుకున్న ముస్లింలు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్ ఈద్గా వద్దకు తరలివచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలతో పాటు ఇమామ్ బోధనలను విన్నారు. రంజాన్ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

8

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా జరుగుతున్న నీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నీటి శుద్ధి కేంద్రంలో పంప్‌హౌస్‌లోని ఆపరేషన్, మెయింటేనెన్స్‌లో భాగంగా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సిరిసిల్ల వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని గ్రామాలు, చొప్పదండి మున్సిపాలిటీకి నీటి సరఫరాలో అంరాయం ఉంటుందని పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ, మున్సిపాలిటీలు, విలీన గ్రామాలకు, తంగళ్లపల్లి మండలంలోని 15 గ్రామాలు, వేములవాడ రూరల్ మండలంలోని ఆరు గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం ఉండదని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11: సెల్‌ఫోన్ పోవడంతో పోలీసులు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ యాప్ ద్వారా ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని గురువారం గుర్తించారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన ఉచ్చిడి పవన్‌కు అప్పగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న పవన్ తన సెల్‌ఫోను పోయిందని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సెల్‌ఫోను లభించిన వ్యక్తిని గుర్తించి అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోనును బాధితుడు పవన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమాకాంత్ మాట్లాడుతూ ఎవరిదైనా సెల్‌ఫోన్ పోతే బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. యాప్ ద్వారా ఎక్కడ ఉందో గుర్తించి అందజేస్తామన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అందె సురేశ్ తల్లి రామవ్వ ఇటీవల మృతి చెందగా గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు రమేశ్‌గౌడ్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా ఉమామహేశ్వర కల్యాణ మహోత్సవం



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మృత్యుంజయం

గంభీరావుపేట, ఏప్రిల్ 11 : గంభీరావుపేట మండల కేంద్రంలో మనమయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉమామహేశ్వర కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం అమ్మవారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించారు.

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, ఏప్రిల్ 11 : గంభీరావుపేట మండల కేంద్రంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు గురువారం సన్మానించారు. రంజాన్ సందర్భంగా స్వగ్రామమైన గంభీరావుపేటకు అజ్మతుల్లా హుస్సేనీ వచ్చారు. అజ్మతుల్లా హుస్సేనీ ఇంటికి కొండూరు రవీందర్‌రావు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, నాయకులు లక్ష్మన్, నాగరాజు తదితరులు ఉన్నారు.

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 11 : ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండే విధంగా అల్లా దీవెనలు లభించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం నాడు వేములవాడ పట్టణంలోని ఈద్గా వద్ద ఆయన ముస్లిం సోదరులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నెల రోజులు లోక కళ్యాణార్థం అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉండి సమాజంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటారని అన్నారు. నెలరోజుల ఉపవాస దీక్షలో అనేక సత్ ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు పడి రాష్ట్రమంతా సుభిక్షంగా ఉంటూ ప్రజలు పాడి పంటలతో సుఖసంతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని అన్నారు. రంజాన్ పర్వదినం శాంతి, ప్రేమ, దయ, సౌభ్రతుత్వ గుణాలను పంచుతుందన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో తనపై నమ్మకం ఉంచి తన గెలుపులో భాగస్వామ్యం అయినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ముస్లిం సోదరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, లౌకిక దేశంలో అన్ని మతాల అన్ని కులాల అన్ని వర్గాల సమానం అన్నారు. వేములవాడ పట్టణంలో జరిగే పండుగలు అన్ని కూడా మత సామ్రాస్యానికి ప్రత్యేకంగా నిలిచేలా హిందూ, ముస్లిం భాయి భాయి అనేలా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మత పెద్దలు, మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు అంచున ప్రమాదం

- ప్రమాదకరంగా గుంతలు - పట్టించుకోని అధికారులు
- వాహనదారుల ఇబ్బందుల

చందుర్తి, ఏప్రిల్ 11 : చందుర్తి మండల కేంద్రం నుంచి రామన్నపేటకు వెళ్లే రహదారిలో ఎల్లమ్మ ఆలయ సమీపంలో గల ఎల్లంపల్లి కాలువపై నిర్మించిన కల్వర్టు సమీపంలో ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో కల్వర్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా వరద నీటితో రోడ్డు కోత గురవడంతో గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేయించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుంతల ప్రదేశంలో ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఈ రోడ్డుపై రాత్రివేళల్లో ప్రయాణించే వారు భయాందోళనకు గురవుతున్నారు. గుంతలను పూడ్చివేసి ప్రమాదాలను నివారించాలని రామన్నపేట, తిమ్మాపూర్, ఆసిరెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కల్వర్టు వద్ద ఏర్పడిన గుంత

గుంతను పూడ్చివేయాలి

- దుమ్మ ఆనంద్, మాజీ సర్పంచ్, రామన్నపేట



ఎల్లంపల్లి కాల్వ పైనిర్మించిన కల్వర్టు వద్ద ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే పలువురు గాయపడ్డారు. గుంతను వెంటనే పూడ్చి వేయాలి. కల్వర్టుపై సీసీ కొట్టుకపోవడంతో ఇనుప సలాకలు పైకి తేలాయి. వాహనదారుల టైర్లకు గుచ్చుకునే ప్రమాదం ఉంది. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలి.

జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగిద్దాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 11 : మహాత్మాజ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగిద్దామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా గురువారం వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి యువతరం పూలే ఆలోచనలు, ఆశయాలు తెలుసుకొని పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అణచివేతకు గురవుతున్న వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడన్నారు. మారుతున్న ప్రపంచానికి, దేశానికి అనుగుణంగా ఉండేందుకు, అణచివేత నుంచి బయటకు రావాలంటే చదువు ఒక్కటే తోడ్పాటు అందిస్తుందని, చదువు ప్రాముఖ్యతను అనేక మందికి తెలుపుతూ ఎంతోమందిని ఉన్నతమైన మార్గంలో వెళ్లేందుకు దారి చూపిన గొప్ప విద్యావేత్త అని అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే సతీమణి సావిత్రి బాయి పూలే దేశంలో మొట్టమొదటి భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అని అన్నారు. సమాజంలోని అట్టడుగు కులాల అభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. వారు ఉన్నతమైన చదువులు చదివేందుకు వీలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. వెనకబడిన తరగతుల వారు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుకు పోవాలని, వారు ఉన్నత స్థాయిలో ఉండాలని ఆనాడు రాజీవ్ గాంధీ రాజ్యాంగ సవరణల ద్వారా ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మహిళలకు అవకాశం కల్పించారన్నారు. 18 సంవత్సరాల వారికి ఓటు హక్కు కల్పించి ప్రభుత్వాన్ని ఎన్నుకునే బాధ్యత ఇచ్చారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మహనీయుల జయంతి, వర్ధంతి జరుపుకునేందుకు వీలుగా, ఈ తరానికి వారి సేవలు తెలిసేలా, వారిని మార్గదర్శిగా తీసుకొని జీవితంలో ముందుకు పోయేలా వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, పుల్కం రాజు, కనికరపు రాకేష్, కృష్ణ, ముకుంద రెడ్డి, బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆది శ్రీనివాస్









ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11: పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో స్పెషలిస్టుగా విధులు నిర్వహిస్తున్న రాగంపేట చంద్రశేఖర్ అనే ఉపాధ్యా యుడి సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు డిమాండ్ చేశారు. గురువారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాడుగుల రాములు మాట్లాడుతూ సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదోతరగతి మూల్యాంకనం విధుల్లో భాగంగా బుధవారం స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రాగంపేట చంద్రశేఖర్‌ను స్పాట్ విధులు, సర్వీసు నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఫోన్‌లో మాట్లాడు తున్నాడనే కారణంతో అక్రమంగా అన్యాయంగా సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇలాంటి చిన్న కారణంతో సస్పెండ్ చేస్తే చివరకు ఒక్కరు కూడా స్పాట్ అయ్యే వరకు మిగులరని అన్నారు. చిన్న తప్పులకు పెద్ద శిక్ష వేయడం సరికాదని, కనీసం సంజాయిషీ కూడా కోరకుండా చర్యలు తీసుకోవడమేమిటని ప్రశ్నిం చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, రాగంపేట చంద్రశేఖరావు, జిల్లా ఉపాధ్య క్షులు ఎన్.బాలయ్య, జానకి, వి.బాల య్య, కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై స్వామివారల విహారం



అశ్వ వాహనంపై విహరిస్తున్న స్వామి వారు

వేములవాడ, ఏప్రిల్ 11: శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భం గా పార్వతీరాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివార లు గురువారం అశ్వవాహనంపై విహరించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల మూడోరోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు రాజరాజేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామికి ఉపనిషత్ ద్వారాభిషేకం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేక ములు నిర్వహించారు. రాత్రి అందంగా అలంకరించిన అశ్వవాహ నంపై పట్టణ వీధుల మీదుగా స్వామివారలను ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




బుచ్చిరాంరెడ్డి(ఫైల్)

గంగాధర/చందుర్తి, ఏప్రిల్ 11: గంగాధర మండలం కురిక్యాల వద్ద ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలి పిన వివరాల ప్రకారం గురువారం రాజన్నసిరి సిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన నాయిని బుచ్చిరాంరెడ్డి (40) జీవనోపాధి కోసం కొత్తపల్లిలో ఉంటు న్నాడు. ద్విచక్రవాహనం(టీఎస్ 7ఈఎల్6 90 7)పై గురువారం ఉదయం స్వగ్రామ మైన మర్రిగడ్డ గ్రామానికి వచ్చి నర్సింగా పూర్ గ్రామంలో ఉంటున్న కూతరు దగ్గరికి వెళ్లాడు. అ నంతరం కొత్తపల్లికి వెళుతుండగా ఆ సమయంలో కరీంనగర్ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళుతున్న ఓ వ్యాను(సీజీ4ఎస్ఎక్స్4779) గంగాధర మండలం కురిక్యాల మూల మలుపు వద్ద బుచ్చిరాంరెడ్డి వాహనాన్ని ఢీ కొట్టిం ది. కిందపడ్డ బుచ్చిరాంరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. 108లో కరీం నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యా ప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.









వందశాతం ఓటింగ్‌కు కార్యకర్తలు కృషి చేయాలి

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 11: కరీంనగర్ పార్లమెంట్‌పరిధిలో వంద శాతం ఓటింగ్‌కు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని రంగినేని గార్డెన్స్‌లో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ బూత్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోని కార్యకర్తలు సైతం బీజేపీకే ఓటేసేందుకు సిద్ధమయ్యారన్నారు. దేశానికి ప్రధానిగా మోదీ పట్ల విశ్వసనీయత ప్రదర్శిస్తున్నారన్నారు. ఏడాది క్రితమే ప్రవేశపెట్టిన సేతుబంధన్ స్కీంలో ఆర్ఓబీకి నిధులు తీసుకు వస్తే ఐదేళ్లక్రితం ఎంపిగా తాను ఎలా నిధులు తీసుకువచ్చాడో బీఆర్ఎస్ అభ్యర్థి సమాధానం చెప్పాలన్నారు. మంత్రి పదవి రాగానే పొన్నం ప్రభాకర్ మిడిసిపడుతున్నాడన్నారు. కరీంనగర్‌లో బీజేపీ మెజారిటీతో గెలువడం ఖాయమైపోయిందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండో స్థానం కోసం పోటీ పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదతరులు పాల్గొన్నారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయనతో పాటు కటకం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


సాయి ఆలయంలో అఖండ నామ సంకీర్తన



అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం నిర్వహించిన సాయి అఖండ నామ సంకీర్తన ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి అంటూ భక్తుల నామ స్మరణతో మారుమ్రోగింది. సాయి ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న సాయి అఖండ నామ సంకీర్తన మొదటి రోజు గురువారం వేద పండితుల పూజ కార్యక్రమంతో ఘనంగా ప్రారంభించారు. సాయి బాబా విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన 1008 కళశాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, రవి చంద్ర, కిషన్, పురుషోత్తంరావు, రాంకిషన్‌రావు, రాజలింగం, తవుటు రాంచంద్రం, తిరుపతి, మారుతి, గుండేటి రాజు ఉన్నారు.

'షట్చక్రం' గ్రంథానికి గండ్ర హనుమంతరావు స్మారక పురస్కారం



షట్చక్రం గ్రంథం, లక్ష్మణ చక్రవర్తి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 11: తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యుడు, విమర్శకుడు డాక్టర్ లక్ష్మణ చక్ర వర్తి రచించిన 'షట్చక్రం' గ్రంథం గండ్ర హనుమంతరావు స్మారక పురస్కారానికి ఎంపిక యింది. ప్రతియేటా రాష్ట్ర స్థాయిలో కవిత్వ యేతర ప్రక్రియలకు అందించే ఈ పురస్కారానికి 'షట్చక్రం' ఎంపికయినట్లు కమిటీ బాధ్యులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల చివరి వారంలో ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు.

పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఏప్రిల్ 11: మల్యాల కొత్తపేటలో పోచమ్మకు భక్తులు గురువారం మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ ఆలయంలో ఎస్సీ కాలనీ వాసులు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బోనాల వేడుకలు నిర్వహించగా మహిళలు బోనాలతో గ్రామంలో శోభాయాత్రతో ఆలయానికి వచ్చి పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ వేడుకలో ఎస్సీ కాలనీ వాసులతో పాటు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ ప్రాణ ప్రతిష్ఠ

- ఆలయంలో కుంకుమ పూజలు చేసిన మహిళలు



ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో బంగారు మైసమ్మతల్లి ఆలయంలో మైసమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి, ఆలయం పునర్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు గురువారం వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన సందీప్ ఆధ్వర్యంలో అలయ ఆవరణలో మహాయజ్ఞాన్ని పూజారి రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వంద మంది మహిళలు కుంకుమ పూజలతో పాటు రుద్రహోమం, మూల మంత్ర హవనం, శయ్యాధివాస, పూజలు చేశారు. కార్యక్రమాల్లో టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, మున్సిపల్ కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బోద్దుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 11: న్యూమారేడు పాకలో దుప్పిని చంపి మాం సాన్ని విక్రయి స్తున్న ముగ్గురు వ్యక్తుల ను గురువారం గోదావరి ఖని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం రావడం తో టూటౌన్ సీఐ బి.రవీందర్, ఎస్ఐ సనత్‌కుమార్ అక్కడికి చేరుకొని మాంసం విక్రయిస్తున్న లోకిని మల్లేష్, గంట మోహన్, బండారి సురేందర్ లను పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

కంటైనర్‌లో వచ్చి.. రెక్కీ చేసి.. ఏటీఎం చోరీ



సీసీ టీవీ ఫుటేజీతో నిందితుడి గుర్తింపు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడిని అరెస్టు చేసిన పోలీసులు

వారంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు. లారీలపై పని చేస్తూ దొంగతనాలు అలవాటు చేసుకున్నారు. మార్చి 18న ఓ కంటైనర్‌తో హుజూరాబాద్‌కు వచ్చారు. శివారు ప్రాంతంలోని ఓ దాబా వద్ద కంటైనర్‌ను ఉంచి పట్టణంలోకి ప్రవేశించారు. రాత్రి వేళలో ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన ఓ కారును, బైకు దొంగిలించారు. వాటిపై ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వచ్చారు. అక్కడి పరిస్థితులను గమనించి వెళ్లిపోయారు. తెల్లవారు జామున మళ్లీ ఏటీఎం వద్దకు సీసీ కెమెరాపై నల్ల రంగు స్ప్రే చేశారు. అనంతరం గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంను బద్దలు కొట్టి నగదును చోరీ చేసి కారు, బైక్‌పై పారిపోయారు. తుమ్మనపల్లి శివారులో వాహనాలను వదిలి కంటైనర్ వద్దకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.. ఎటువంటి ఆధారాలు లేకుండా సవాలుగా మారిన ఈ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ ముఠాలోని ఓ సభ్యుడిని అరెస్టు చేశారు.

హుజూరాబాద్, ఏప్రిల్ 11: హుజూరాబాద్ ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు పాల్పడిన ముఠాలోని ఓ సభ్యుడిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సబంధించిన వివరాలను హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఏసీపీ శ్రీనివాస్‌జీ గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా మార్చి 18 హుజూరాబాద్ కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి 8.64 లక్షల రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారన్నారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు చోరీ జరిగిన రోజు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిందని తెలిపారు.

ఆర్‌జే11 జీబీ 7370 అనే కంటైనర్ అనుమానాస్పదంగా కనిపించిందని, ఆ కంటైనర్ పక్కన ముషారఫ్ అనే వ్యక్తిని బృందంలోని సభ్యులు గుర్తించారన్నారు. బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే కంటైనర్ కనిపించిందని, అందులోని వ్యక్తిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని ఏసీపీ చెప్పారు. మార్చి 18న హర్యాణాకు చెందిన ముషారఫ్, అతని సోదరుడు సఫత్, ఫరీద్, ఢిల్లీకి చెందిన అఫ్తాబ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాజీద్ ఆర్‌జే11జీబీ7370అనే కంటైనర్ లారీలో హుజూరాబాద్ శివారులోని ఓ దాబాకు వచ్చారన్నారు. అక్కడ లారీని నిలిపి పట్టణంలోకి వచ్చి ఓ కారు, మోటార్ సైకిల్‌ను దొంగతనం చేశారన్నారు. ఆ వాహనాలపై తిరుగుతూ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రెక్కీ నిర్వహించారని తెలిపారు.

అక్కడి నుంచి వెళ్లిపోయి తెల్లవారు జామున ఏటీఎం వద్దకు వచ్చి సీసీ కెమెరాకు నల్ల రంగు స్ప్రే చేశారని చెప్పారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి 8.64 లక్షల రూపాయలు దోచుకొని తుమ్మనపల్లి శివారులో వాహనాలను వదిలిపెట్టి కంటైనర్ లారీలో పారిపోయారన్నారు. బుధవారం వాహన తనిఖీల్లో ముషారఫ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతడు వివరాలన్నీ వెల్లడించాడన్నారు. ముషారఫ్ వద్ద నుంచి 60 వేల రూపాయలు, కంటైనర్ లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న మిగితా నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ బొల్లం రమేష్, ఎస్ఐ సాంబయ్య, హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు, నెల్లి మోహన్, అవినాష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

నేతన్నలకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమల సంక్షోభాన్ని నివారిం చేందుకు నేతన్నలకు ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీనిచ్చారని, త్వరగా ప్రభుత్వ ఆర్డర్లను అందించి నేతన్నలను ఆదుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు బుధ వారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయం లో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సిరిసిల్లకు చెందిన జేఏసీ నాయకులతోపాటు వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రలల్లో నెలకొన్న సమస్యలతోపాటు బతుకమ్మ చీరలు, యారన్ సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీతోపాటు వివిధ సమస్యలపై డైరెక్టర్ అలుగు వర్షిణికి వినతి పత్రాన్ని అందించామని జేఏసీ నాయకులు తెలిపారు. అనంతరం కరీంనగర్‌లో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి డైరెక్టర్ అలుగు వర్షిణికు చెప్పిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్‌లు మూషం రమేష్, పంతం రవి, సభ్యులు కూరపాటి రమేష్, మండల సత్యం, మంచె శ్రీనివాస్, తాటిపాముల దామోదర్, గోలి వెంకటరమణ, సిరిసిల్ల రవీందర్, సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, వేముల దామోదర్, పిస్క మధు, కోడం రమణ, అశోక్, గౌడరాజు, గోనే పర్శరా ములు, ఏనుగుల ఎల్లయ్య, బండారి అశోక్, నక్క దేవదాస్, గుండు రమేష్, గోవిందు రవి తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

మూడు ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులు సీజ్



వైద్యుడికి నోటీస్ ఇస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11: రా జన్న సిరిసిల్ల జిల్లాలోని మూడు ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులను(లేబర్ రూంలు)గురు వారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు మాట్లాడారు. 202 3-24లో జిల్లాలో 100 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారా మాత్రమే నిర్వహించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సరయు ఆస్పత్రి, వేములవాడలోని అమృత నర్సింగ్ హోమ్, వాసుదేవ ఆ స్పత్రుల్లో వంద శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారా చేశారని, కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు ఆస్పత్రుల్లోని ప్రసూతి గదులు సీజ్ చేశామని తెలిపారు. ఆస్పత్రుల వైద్యులకు, నిర్వాహకులను నోటీసులు అందజేశామన్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూడు ఆస్పత్రుల్లో ప్రసవాలు నిర్వహించడానికి వీలులేదని తెలిపారు. నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారులు శ్రీరాములు పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రసూతి గదిని సీజ్ చేస్తున్న అధికారులు

పరిహారం ఇచ్చిన తరువాతే భవనాలను నిర్మించాలి

- పనులను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: పరిహారం ఇచ్చిన తర్వాతనే మెడికల్ కళాశాల అదనపు భవనాలను నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో చేపట్టిన మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణ పనులను రైతులు బుధవారం అడ్డుకున్నారు. గురువారం ఉదయం తిరిగి పనులు ప్రారంభించగా రైతులు, వారి కుటుంబ సభ్యులు సుమారు వంద మంది పనులను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టౌన్‌సీఐ రఘుపతితో పాటు నలుగురు ఎస్‌ఐలు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి చేరుకోని ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం తమ భూములను తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తోందని, కాంట్రాక్టర్ తమపై ఇష్టానుసారంగా మాట్లాడడంతోపాటు దాడులకు పాల్పడుతున్నాండని రైతులు సీఐకు వివరించారు. దీంతో సీఐ రఘుపతి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. దాడులు చేసుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయానికి వస్తే చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చూద్దామని చెప్పడంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్యరెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఉలిసె తిరుపతి, చెన్నమనేని కమలాకర్‌రావు, అకునూరి బాలరాజు, అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజం, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

భగత్‌నగర్, ఏప్రిల్ 11: కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. గురువారం నగరలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు అంజన్న మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లి అసత్య వ్యాఖ్యలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థికరువయ్యాడని, ఫ్రస్టేషన్‌లో ఉండి అలా మాట్లాడుతున్నారన్నారు. బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై పుస్తకం ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేశారన్నారు. ఎంపీ నియోజకవర్గ పరిధిలో 12 వేల కోట్ల రూపాయల అభివృద్ధి చేశారన్నారు. ఆ పుస్తకాన్ని మంత్రికి పోస్టులో పంపిస్తామని చదువుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్, కవితపై ఎందుకు మాట్లాడడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, అభివృద్ధి పనులపై దృష్టి పెడితే మంచిదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, మాజీ ఎంపిపి వాసాల రమేష్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధులు బొంత లకళ్యాణ్‌చంద్ర, ఎడమ సత్యనారాయణరెడ్డి, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, బండ రమణారెడ్డి, మామిడి రమేష్, అవదుర్తి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.



పార్లమెంట్ అభివృద్ధిపై ముద్రించిన పుస్తకాన్ని చూపిస్తున్న రాణి రుద్రమ

తండ్రి మృతితో మనస్తాపం.. కుమారుడి ఆత్మహత్య



విశ్వతేజ మృతదేహం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 11: మండలం లోని అయిలా పూర్ గ్రామానికి చెందిన మారంపల్లి విశ్వతేజ (22) అనే యువకుడు తన తండ్రి మృతికి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వతేజ తండ్రి గంగధర్ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి విశ్వతేజ మనస్థాపానికి గురై తరచు బాధపడేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో తన బెడ్‌రూంలో ఉరేసకుని అత్మహత్య చేసుకున్నాడు. విశ్వతేజ తల్లి చిన్న లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న దాత నిశాంత్‌రెడ్డి

గొల్లపల్లి, ఏప్రిల్ 11: గొల్లపల్లి మండలం చిల్వకోడూర్‌లోని శ్రీ రామ లింగేశ్వర స్వామి జాతర ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు గురువారం హోరా..హోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 19 ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొనగా ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. పోటీలను ఆలయ చైర్మన్ తిరుపతి గౌడ్, వైస్ చైర్మన్ కోమురయ్య జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. పోటిల్లో ప్రథమ విజేతగా ఎండపల్లి మండలం జగదేవ్ పేట గ్రామానికి చెందిన బచ్చల శివకృష్ణ ఎడ్లబండి నిలవగా, దాత గొల్లపల్లి తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి-దీప్తి దంపతులు అందించిన 2.5 గ్రాముల బంగారం గెలుచుకున్నారు. ద్వితీయ, తృతీయ బహుమతులుగా 100, 50 గ్రాముల వెండిని దాతలు బంగిమరం శంకరయ్య జ్ఞాపకార్థం బంగిమరం లలిత-శివకుమార్, బంగిమరం సంతోషిణి-శివప్రసాద్, కోట వెంకన్న జ్ఞాపకార్థం కోట సుజాత-అశోక్ దంపతులు అందించిన గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ బాషామీయా, ఎండపెల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన మెట్‌పల్లి అజయ్ ఇద్దరు సమానంగా పంచుకున్నారు. అనంతరం విజేతలకు దాతలు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమీటీ చైర్మన్ దాసరి తిరుపతి గౌడ్, వైస్ చైర్మన్ సింగారపు కోమురయ్య, తాజామాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యానారాయణ గౌడ్, నాయకులు పురంశెట్టి వెంకటేశం, శివకుమార్, వేణు, రాజయ్య, మహేష్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వాలు అందించాలన్నారు. విద్యార్థుల పక్షాన ఉద్యమాలు చేసి సమస్యల పరిష్కారానికి పాటుపడుతామన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జిల్లా మహాసభల్లో చర్చించి ఆదిశగా ముందుకు సాగుతామన్నారు. విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

చందుర్తి, ఏప్రిల్ 11: మండలం లోని మల్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 2004-05 పూర్వ విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితురాలుకు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మల్యాల గ్రామం చెందిన దమ్మ మమత అనారోగ్యంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ బాధపడుతున్న విషయం తెలుసుకొని తోటి పూర్వ విద్యార్థులు కలిసి దమ్మమమతకు రూ. ఒక లక్ష వేల32ల 516 ఆర్థిక సహాయం అందజేశారు.

బీజేపీ వాణిజ్యసెల్ మండల అధ్యక్షుడిగా లక్ష్మణ్



ఇల్లంతకుంట, ఏప్రిల్ 11: బీజేపీ వాణిజ్య సెల్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన నార్ల లక్ష్మణ్‌ను నియమిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మన్‌కు బీజేపీ రాష్ట్ర నాయకులు మ్యాకల మల్లేశం, తిప్పారపు శ్రావణ్, బత్తిని స్వామి, అనీల్ అభినందనలు తెలిపారు.

ఆరు గ్యారెంటీల అమలులో విఫలం

కథలాపూర్, ఏప్రిల్ 11: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలోని సిరికొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు రైతు భరోసా కింద రూ.. 15వేలు, క్వింటాల్ ధాన్యాన్ని రూ.500 బోనస్, ప్రతీ రైతు కూలీకి ఏడాదికి రూ.12 వేలు, ప్రతీ పేద మహిళకు రూ.2500 ఖాతాలో జమచేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయన్నారు. పింఛన్ ప్రతీ నెల రూ.4 వేల చొప్పున ఇస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. సూరమ్మ చెరువు పనులను అధికారంలోకి రాగానే ప్రారంభిస్తామని చెప్పి నేటికీ ఆ ప్రక్రియను పట్టించుకోవడం లేదన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం రూ. 1300 వరి మద్దతు ధరను రూ.2200లకు పెంచిందని అదేవిధంగా డీఏపీ ఎరువులకు సంబంధించి ముడి సరుకుల ధరలు పెరిగినప్పటికీ పూర్తి సబ్సిడీ భరిస్తోందని అన్నారు. ఈ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్‌లో బండి సంజయ్ మరో సారి విజయకేతనం ఎగురవేయబోతున్నారన్నారు.

బండి సంజయ్‌పై ఆరోపణలు సరికాదు

మల్యాల, ఏప్రిల్ 11: ఎంపీ బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలు సరికాదని మండల బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కొండగట్టులో పర్యటించిన మంత్రి అబద్దాలు మాట్లాడారని గత ప్రభుత్వంపై రైతులు, నిరుద్యోగులు తదితర వాటిపై ఎంపీ సం జయ్ ఉద్యమాలు చేసిన సంఘటనలు మరచిపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

ధర్మపురి, ఏప్రిల్ 11: ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని, ప్రజలు గెలిపించింది తన ఆస్తులు లెక్క పెట్టడానికా, లేక ప్రజలకు పని చేయడానికా సమాధానం చెప్పాలని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. ధర్మపురిలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానం తెలిసిపోయిందని, తాగు, సాగు నీరు లేకపోవడంతో ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే తన గురించి మాట్లాడారని, తనకు ఇన్ని డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని అన్నారని అన్నారు. ఎన్ని ఆస్తులు ఉన్నాయో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లెక్క చెప్పాలని అన్నారు. అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలు పొందుపరిచామన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలేకు ఘన నివాళి


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న రవీందర్‌రావు, ఆగయ్య


కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ కార్యాలయంలో..

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. దేశంలో అంటరానితనం, కుల నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు జ్యోతిబాపూలే ఎంతో కృషి చేశారన్నారు. స్త్రీలు విద్యావంతులు కావాలని భావించి దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించారన్నారు. సత్యశోధక మండలి ఏర్పాటు చేసి ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకై నిలిచారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు కుంభాల మల్లారెడ్డి, గజభీంకార్ రాజన్న పాల్గొన్నారు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

సిరిసిల్ల పట్టణం శివనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటం వద్ద కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, కౌన్సిలర్లు గుండ్లపెల్లి రామానుజం, వేముల రవి, భూక్య రెడ్డినాయక్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, నాయకులు కాముని నళినికాంత్, వైద్య శివప్రసాద్, కత్తెర దేవదాస్, నీలి రవీందర్, కాసర్ల రాజు, నక్క నర్సయ్య, కోడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

సిరిసిల్ల పట్టణం బీసీ భవనంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పర్శ హన్మండ్లు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే తొలి సామాజిక సంస్కర్త అన్నారు. పూలే చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్న అవార్డును ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రగుడు చౌరస్తాలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఏలూరి చంద్రకాంత్, తడక కమలాకర్, కంచర్ల రవిగౌడ్, కందుకూరి రామాగౌడ్, కంచర్ల రాజు, ఇల్లంతకుంట తిరుపతి, శ్రీనివాస్, బాలు, శ్రీకాంత్, కైలాశ్, శ్రీధర్, రాములు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే అని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబాపూలే ఆశయ సాధన కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, పరకాల రవీందర్, కార్యదర్శులు పాముల స్వామిగౌడ్, కొత్వాల్ ప్రవీణ్, కోలాటం మల్లేశం, శ్రీనివాస్, భూమేష్, ప్రతాప్, హరిప్రసాద్, శ్రీనివాస్, మహేష్, రవీందర్, శ్రీపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..

మహాత్మా జ్యోతిరాబాపూలే జయంతిని పట్టణంలోని గీతానగర్ పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జ్యోతిబా పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని లోకిని శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సిరిసిల్ల పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కుసుమ రామయ్య పాఠశాలలో ఉన్న పూలే విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా నాయకులు కోడం రమణ, సూరం పద్మ, నక్క దేవదాస్, గుండు రమేష్, సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేష్, బెజుగం సురేష్, బింగి సతీష్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలో జ్యోతిబాపూలే జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్ గ్రామాలలో గురువారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన మహనీయుడు పూలే అన్నారు. ఆయన ఆశయాల సాధనకు పాటుపడుదామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సావనపెల్లి రాకేష్, కూనబోయిన బాలరాజు, లింగంపల్లి రవీందర్, కూనబోయిన పోచయ్య, కనుకయ్య, లింగంపల్లి బాలయ్య, సిరికొండ రాజు, అంతగిరి శ్రీనివాస్, కాసుపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మండ్లు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్, బండలింగంపల్లి, గొల్లపల్లి, బొప్పాపూర్, దుమాల, రాజన్నపేట, గుండారం, అల్మాస్‌పూర్, అక్కపల్లి గ్రామాల్లో జ్యోతిబాపూలే జయంతిని గురువారం నిర్వహించారు. నారాయణపూర్‌లో ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను స్థానిక నాయకులతో కలిసి హన్మండ్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హన్మండ్లు మాట్లాడుతూ జ్యోతిబాపూలే చేసిన సేవలు ఎనలేనివన్నారు. రాజ్యాధికారం కోసం ముదిరాజ్‌లు కలిసి కట్టుగా ఉద్యమించాలన్నారు. గత శాసన సభ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం లేదని, ఏకతాటిపై నిలిచి మన సత్తా చాటడడంతో ఎంపీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమ కులానికి చెందిన వారిని ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించాయని పేర్కొన్నారు. ముదిరాజులను బీసీ ఏలో కలిపేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. విగ్రహాల దాత డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో జ్యోతిబాపూలే, అంబేద్కర్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. వెంకటాపూర్‌లోని జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో జ్యోతిబాపూలే వేడుకలను నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. బీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు జ్యోతిబాపూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, గోపాల్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీలు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల నాయకులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. గండిలచ్చపేటలో జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షుడు మునిగే భాస్కర్, మండల కార్యదర్శి చిట్యాల మహేష్, మెులిగే ప్రేమ్, రవి, కమలాకర్, శివపాటు గండిలచ్చపేట గ్రామ పెద్దలు జంగిటి అంజయ్య, సీరటి బాబు, బల్లెపు దేవయ్య, సిద్ధన్న పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గజ్జెల అశోక్, సిరిసిల్ల నియోజకవర్గ కార్యదర్శి ఈసంపల్లి కొమురయ్య, మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు గుంటుకు తిరుపతి, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు లింగాల సందీప్, సంజీవ్, ప్రశాంత్, శృతిక, మౌనిక, స్వీటి, శ్వేత, నగరపు జితేందర్, మనోజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఎర్రవెల్లి నాగరాజు, ఎల్లారెడ్డి, అశోక్, జవ్వాజి విమల జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మనోజ్, రాజేశం, సతీష్‌రెడ్డి, మల్లేశం, పవన్, జితేందర్, సంపత్, రమేష్, కిషన్ తదితరులు ఉన్నారు.


వేడుకల్లో పర్శ హన్మండ్లు


గంభీరావుపేటలో..


నివాళులు అర్పిస్తున్న శాత్రాజుపల్లి గ్రామస్థులు

కోనరావుపేట: కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం మండల అధ్యక్షురాలు జవ్వాజి విమల పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మహాత్మాజ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య నాయకులు దుమ్మ అంజయ్య, బత్తుల కమలాకర్, నల్మాస్ రవీందర్‌రెడ్డి, మార్త గంగాధర్, లింగాల మల్లయ్య, మెడిశెట్టి జగన్, రమేష్, దాసు పాల్గొన్నారు.


సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు


పూలే విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు


నివాళులు అర్పిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


వేములవాడలో ప్రార్థన నిర్వహిస్తున్న ముస్లింలు


ఈద్గా వద్ద అజ్మతుల్లా హుస్సేనీ ప్రార్థనలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్, తుర్కాసిపల్లె, రగుడు, చంద్రంపేట, సర్దాపూర్, ముష్టిపెల్లి రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల తదితర గ్రామాలలోని మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దూర్ శివారులోని తుర్కకాశి పల్లె మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ అధ్యక్షుడు, 9వ వార్డు టీఆర్ఎస్ అధ్యక్షుడు షేక్ అలీతో పాటు మైనార్టీ నాయకులను విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు దడిగెల శ్రావణ్‌రావు, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు అగ్గిరాములు, కౌన్సిలర్లు పోచవేని సత్యఎల్లయ్య, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మీ, ఓగ్గు ఉమ, బోల్గం నాగరాజుగౌడ్, కల్లూరి లతమధు, చెన్నమనేని కీర్తి, భూక్య రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ కో ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి బాలయ్యగౌడ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు గంద్ర రమేష్‌రావు, ఎరవెల్లి శ్రీనివాసరావు, జూపల్లి శ్రీనాథ్‌రావు, వీరగోని శ్రీనివాస్‌గౌడ్, పోచవేని ఎల్లయ్యయాదవ్, బుర్ర మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, తహసీల్దార్ రాంచందర్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, ఎంపీడీవో సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లంతకుంట: నెల రోజులపాటు ఉపవాస దీక్షలతో గడిపిన ముస్లింలు గురువారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం రాత్రి నెలవంక కనపడడంతో గురువారం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలపుకున్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మదీనా మసీద్‌లో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మైనార్టీ నాయకుడు హమీద్ ఇంట్లో రంజాన్ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు చుక్క శేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు. సారంపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు షేక్ అబుబాకర్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలను నిర్వహించగా బీఆర్ఎస్ నాయకులు పడిగెల రాజు, కొయ్యడ రమేష్, ఎగుమామిడి వెంకటరమణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మదీనా మసీద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ హమీద్ మౌలానా, అక్రమ్ రాజా, కమిటీ సభ్యులు గౌసొద్దీన్, హైదర్, జానీ, సలీం, కాసిం, ఇమామ్ మహ్మద్ బాబా, అల్లా భక్షీ, జహంగీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రంజాన్ పండగను ముస్లింలు మండల వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీపీ మాలోతు భూల, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో సత్తయ్య, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్, ఆయా పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈద్గా కమిటీ తరపున అజ్మతుల్లా హుస్సేనీకి సన్మానం చేశారు.

వేములవాడ: రంజాన్ పర్వదిన వేడుకలను గురువారం వేములవాడలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులపాటు ఉపవాసం పాటించిన ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ఉదయం మసీదులకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త ద్వారా ప్రపంచ శాంతి కోసం అల్లా పంపిన సందేశాన్ని ఈ సందర్భంగా ఈద్గా వద్ద జామే మసీద్ ఇమామ్ వినిపించారు. ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోపాటు గ్రామాల్లో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మాజీ కో ఆప్షన్ మెంబర్లు అబ్దుల్ రషీద్, యాకూబ్, ముస్లిం నాయకులు సిద్ధిక్, రియాజ్, గయాజ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, నాయకులు మ్యాకల గణేష్, ధర్మపురి శ్రీనివాస్, పులి సత్తయ్య, పోతరాజు నగేష్, బాలకృష్ణ, సలీం, అజీమ్ పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేటలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఆగయ్య


రంజాన్ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు


ఎల్లారెడ్డిపేటలో..